క్లుప్తంగా

వినతుల వెల్లువ..


మంత్రి నిరంజన్‌రెడ్డికి..

నేలకొండపల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు రూ.35 వేల వేతనాలు అందించాలని సెక్యూరిటీ గార్డ్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మారగాని వీరబాబు డిమాండ్ చేశారు. మాదాపురంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి అసోసియేషన్ ఆధ్వర్యాన వినతి పత్రం అందించారు. మార్కెట్ ఉద్యోగుల తరహాలోనే వేతనాలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచి ఏజెన్సీలను ఎత్తివేయాలని, జీఓ నంబర్ 21ను సవరించాలని కోరారు.

విద్యుత్ శాఖ ఏడీకి..

కూసుమంచి: రైతాంగానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యాన బుధవారం విద్యుత్ శాఖ ఏడీ కోక్యా నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం సాగు చేసిన పంటలకు విద్యుత్ కోతలతో నీరందక ఎండిపోతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని 24 గంటల కరెంట్ సరఫరా చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా నాయకులు మల్లెల హన్మంతరావు, ఎడవెల్లి రమణారెడ్డి, మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్, కార్మిక సంఘం మండల కార్యదర్శి మూడ్ గన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు..



హెచ్ఎంకు వినతి ఇస్తున్న భాషా పండితులు

రఘునాథపాలెం: భాషాపండితుల న్యాయమైన సమస్యల పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండలంలోని వేపకుంట్ల పాఠశాల హెచ్ఎం నారాయణకు భాషాపండితులు వినతి పత్రం అందించారు. ఉపాధ్యాయుల పదోన్నతల విషయంలో భాషా పండితులకు అన్యాయం జరుగుతుందని, కోర్టు పేరుతో తమకు జరిగే అన్యాయంలో ప్రభుత్వం న్యాయం చేయాలంటూ వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌కె.జానిమియా పాల్గొన్నారు.

ఆలయానికి రూ.1,01,116 వితరణ



చెక్కు అందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం అర్బన్: నగరంలోని కైకొండాయిగూడెం క్రాస్ రోడ్డు వద్ద శ్రీ అంకమ్మ శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల నూతన దేవాలయ నిర్మాణానికి ది ఖమ్మం గ్రానైట్స్ స్లాబ్ స్క్రాప్ ఓనర్స్ అసోసియేషన్ బాధ్యులు రూ.1,01,116లను బుధవారం ఆలయ కమిటీకి అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కొమ్ము భాస్కర్, కార్యదర్శి సూరంశెట్టి నర్సింహారావులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి గుండోజు రామాచారి, సభ్యులు దామళ్ల పాపారావు, మట్టేపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని విస్మరించిన కేంద్రం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం విద్యా రంగానికి సరిపడా నిధులు కేటాయించకుండా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వంగూరు వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు తుడుం ప్రవీణ్‌లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి కేంద్రం అధిక నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు షేక్ సుభాని, ధర్మవరపు యువరాజు, లింగరాజు, చందులాల్, లక్ష్మణ్, మలుసురు, నరేష్, సతీష్, ప్రేమ్‌కుమార్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పఠాన్
వినోద	వారసుడు
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	పఠాన్
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	హంట్

- ఖమ్మంవ్యవసాయం

‘రియల్’ దందా..!



పెదతండా ఏరియాలో ఆక్రమణకు గురైన పంట కాల్వ

పంట కాల్వలనూ వదలని రియల్టర్లు

- ఆక్రమణతో పాటు ఏకంగా నిర్మాణాలు చేపడుతున్న వైనం
- పది ఎకరాలకు పైగా ఆక్రమణలు
- కబ్జా భూమి విలువ రూ.30కోట్లు పైమాటే
- పట్టించుకోని అధికారులు

ఖమ్మంరూరల్: కబ్జాకు కాదేదీ అనర్హం.. అన్నట్లు ఏకంగా వ్యవసాయ భూములకు వెళ్లే పంట కాల్వలను సైతం రియల్టర్లు వదలడం లేదు. పొలాలకు పారే కాల్వలను కబ్జా చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. జిల్లాలో రోజురోజుకు రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతుండగా దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు రియల్టర్లు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. వెంచర్ల పేరుతో అనుమతులు లేకుండా పంట భూములను ధ్వంసం చేస్తూ, అధికారుల అండదండలతో కాల్వల ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఎక్కడ వీలు కుదిరితే అక్కడ ప్రభుత్వ భూములను, పంట కాల్వలను ఆక్రమిస్తూ బరితెగిస్తున్నారు. ప్రధానంగా ఖమ్మంరూరల్, మండలంలో ఈ కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది.

పది ఎకరాలకు పైమాటే..

మండల వ్యాప్తంగా ఇలా ఇప్పటి వరకు 10 ఎకరాల వరకు కాల్వల ఆక్రమణకు గురైనట్లు జరుగుతున్నా పరిణామాలను చూస్తుంటే అర్థమవుతోంది. కబ్జా విలువ దాదాపు రూ.30కోట్ల పైమాటే ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత, రెవెన్యూ, ఎన్ఎస్‌పీ, ఐబీ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో రియల్టర్ల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. రియల్టర్ల దందాతో 33 అడుగులు ఉండాల్సిన పంట కాల్వలు ఐదు అడుగుల వరకు ఆక్రమించుకుంటున్నారు. దీంతో పంటపొలాలకు సరిగా సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పంట కాల్వలపై రియల్టర్ల కన్ను..

ఎన్నెస్పీకి చెందిన పిల్ల కాల్వల నుంచి పంట పొలాలకు సాగు నీటిని మళ్లించేందుకు గత 30 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఏదులాపురం చెరువు నుంచి పెదతండా, గుర్రాలపాడు వరకు పంట భూములకు సాగునీరు ఇచ్చేందుకు 33 అడుగుల కాల్వను తవ్వారు. కొంతకాలం వరకు ఆ కాల్వ నుండే సాగునీరు వెళ్లేది. ఎప్పుడైతే రియల్ వ్యాపారం మొదలైందో అప్పటి నుంచి రియల్టర్ల కన్ను పంట కాల్వలపై పడి క్రమక్రమంగా ఆక్రమిస్తూ ప్లాట్లు చేయడం, భవన నిర్మాణాలు చేపట్టడం మొదలుపెట్టారు. రూరల్ మండలంలోని, పెదతండా, ఏదులాపురం, గొల్లగూడెం, ముత్తగూడెం, వరంగల్ క్రాస్‌రోడ్ ప్రాంతాల్లో ఈ కాల్వల ఆక్రమణ ఎక్కువగా ఉంది.

నిబంధనలు గాలికి..

ప్రభుత్వ నిబంధనల మేరకు పంట కాల్వలను పూడ్చివేయడం గానీ, అనుమతులు లేకుండా కాల్వలపైన మట్టివేసి పైపులైన్ సాయంతో రోడ్డును నిర్మించడం గానీ చేస్తే నేరం కిందికి వస్తుంది. సాగు నీటి వనరులకు సంబంధించిన భూములను ఆక్రమించడం, వాటిపై అక్రమ నిర్మాణాలు చేపట్టడం లేదా సొంత ప్రయోజనాలకు కాల్వలను వినియోగించడం చట్టరీత్యా నేరమవుతుంది. ఇలాంటి నిబంధనలు ఉన్నప్పుడు సదరు రియల్టర్లు సంబంధిత అధికారుల నుంచి ఎన్‌ఓసీ సర్టిఫికెట్ పొందిన తర్వాతే కాల్వలపై ప్రజల సౌకర్యార్థం రోడ్డు కానీ భవన నిర్మాణాలు కానీ నిర్మించాల్సి ఉంది.

చోద్యం చూస్తున్న అధికారులు..

అధికారుల అలసత్వమో, నిర్లక్ష్యమో లేదా ఇంకేమైనా కారణమో తెలియదు గానీ రియల్టర్లు మాత్రం కాల్వల ఆక్రమిస్తూ తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. ఏదులాపురం చెరువు నుంచి మొదలైన కాల్వల ఆక్రమణ పర్వం పెదతండా నుంచి గుర్రాలపాడు రెవెన్యూ వరకు కొనసాగుతూనే ఉంది. ఏదులాపురం, పెదతండా, గుర్రాలపాడు రెవెన్యూ ప్రాంతాల్లో వేల ఎకరాల్లో ఉన్న వ్యవసాయ భూములు ఇప్పుడు రియల్‌ఎస్టేట్‌గా మారి ప్లాట్లు, ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ఇప్పటికైనా కాల్వల ఆక్రమణపై సంబంధిత అధికారులు కల్పించుకొని పంట కాల్వలను కాపాడాల్సి ఉంది.

చర్యలు తీసుకుంటాం..

పంటల కాల్వలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఎక్కడెక్కడ ఆక్రమణకు గురయ్యాయో తెలుసు కుంటున్నాం. రియల్ ఎస్టేట్ పక్కన ఉన్న కాల్వలు ఎంత వెడల్పు ఉంటే అంతే ఉంచాలి తప్ప ఆక్రమిస్తే ఎంతటి వారైనా వదిలేదు లేదు. అన్నీ విచారించాకే ఎన్‌ఓసీ ఇస్తున్నాం.

– వెంకటశాస్త్రి, డీఈ, ఇరిగేషన్

ఎమ్మెల్యే ‘కందాల’ విస్తృత పర్యటన

దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ..

ఖమ్మంరూరల్: మండలంలోని కొండాపురం శివారు సీతారాంపురంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి, సీతారామచంద్రస్వామి, బొడ్రాయి, కోదండరామస్వామి, ముత్యాలమ్మ యంత్ర విగ్రహ ప్రతిష్ఠ వినాయకుడు, సాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఆయన సతీమణి విజయమ్మలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. యాగశాలలో అర్చకులు రామశర్మ భక్తులచే ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థాలలోని సంగమేశ్వరాలయంలో నూతనయంత్ర విగ్రహ ప్రతిష్ఠ, స్వామికి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ ఎ. వరప్రసాద్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు ఇళ్ల స్థలాల పట్టాలను బుధవారం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్య, ఎంపీడీఓ జయరాం ఎంపీపీ మంగీలాల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నివాళి..

మండలంలోని రాజారం గ్రామంలో ఇటీవల మృతిచెందిన సామ మల్లారెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బాషబోయిన వీరన్న, సర్పంచ్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెం: కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో చేరిక..

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన పలువురు బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌తో పాటు వేముల వీరయ్య, ఎండీ ఆసిఫ్ పాషా, చాట్ల పరుశురాం, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

‘మన ఊరు మన బడి’ ప్రారంభం..

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని సింగారెడ్డిపాలెంలో మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని పాలేరు శాసనసభ్యుడు కందాల ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, ఎంపీపీ వజ్జా రమ్య, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, పంచాయతీరాజ్ ఈఈ శ్యాంప్రసాద్, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, తహసీల్దార్ దారా ప్రసాద్, సర్పంచ్ నవీన్, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కూసుమంచి: కూసుమంచిలోని గణపేశ్వరాలయం(శివాలయం) నూతన పాలక మండలిని దేవాదాయశాఖ అధికారులు బుధవారం ప్రకటించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా వీరవెల్లి వెంకటేశ్వర్లు నియమితులు కాగా సభ్యులుగా కొక్కిరేణి వీరస్వామి, నలగాటి నాగేశ్వరరావు, మక్కపల్లి రామకృష్ణ యాదవ్, అర్వపల్లి వెంకటేశ్వర్లు, గుండా వనజ, కట్ల ముత్తయ్య, ఎక్స్ అఫీసియో సభ్యుడిగా ఆలయ అర్చకుడు దేవులపల్లి శేషగిరి శర్మ నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు ఎమ్మెల్యే కందాలను కలిసి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

జనసేన నేతల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న జనసేన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం జనసేన పార్టీ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మం నగరంలో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మిరియాల రామకృష్ణ మాట్లాడుతూ.. పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్యపై జిల్లా అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోవడంతో భిక్షటన చేసిన డబ్బులతో వాటి నిర్మాణం చేపడతామన్నారు. అధికారులు స్పందించే వరకు జనసేన పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మెడబోయిన కార్తీక్, అజయ్‌కృష్ణ, దేవేందర్, పవన్, శ్రీకాంత్, ఉత్తమ్‌రాజు, మాలిక్, రమణకుమార్, పుల్లారావు, గంగాధర్,స్రవంతి పాల్గొన్నారు.

‘రాయల’ పరామర్శ



చెరువుమాదారంలో వెంకటరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాయల నాగేశ్వరరావు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం, బుద్దారం, రాయగూడెం, మంగాపురం తండా తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను బుధవారం టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు పరామర్శించారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, బోయిన వేణు, కుక్కల హనుమంతరావు, భూక్యా చిన్న, ఈవూరి శ్రీనివాసరెడ్డి, ఆరెకట్ల గురవయ్య, సూరేపల్లి రవి, సంతోష్, బాలాజీ, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన



బిషప్‌ను సత్కరిస్తున్న సంఘ పెద్దలు

కూసుమంచి: మండల కేంద్రంలోని సీఎస్ఐ ఇమ్మాన్యుయేల్ చర్చిలో రూ.20 లక్షలతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణ పనులకు బుధవారం డోర్నకల్ డయాసిస్ బిషప్ రెవ.డాక్టర్ పద్మారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సంఘ పెద్దలు, కాపరులు బిషప్ పద్మారావుతో పాటు ఆయన తల్లి విజయను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోదాడ గ్రూప్ చైర్మన్ రెవ.జీవానందం, పాస్టర్స్ యూనిట్ చైర్మన్ రెవ.యోహాన్, రెవ.జి.రాజేష్, రెవ.బిషప్ పాల్గొన్నారు.

సమస్యల సాధనకు ఉద్యమాలు

ఖమ్మంరూరల్: విద్యార్థుల సమస్యల సాధన కోసం మరిన్ని ఉద్యమాలు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్ అన్నారు. మండలంలోని ఎంవెంకటాయపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాలకకులు నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. విద్యరంగానికి బడ్జెట్‌లోఎక్కువ నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టేందుకు విద్యార్థి, యువత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు సతీశ్, వంశీ, నర్సింహ, సాయి తదితరులు పాల్గొన్నారు.

లోకల్ ఫండ్ ఆడిట్ ఫోరం ఎన్నిక

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ అనుబంధ లోకల్ ఫండ్ ఆడిట్ ఫోరం కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఈమేరకు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్ కమిటీ వివరాలను వెల్లడించారు. ఎన్నికల అధికారిగా చుంచు వీరనారాయణ వ్యవహరించగా జిల్లా అధ్యక్షుడిగా పి.జ్వాలా నర్సింహరావు, కార్యదర్శిగా బానోతు హరికృష్ణ, ఉపాధ్యక్షురాలిగా ఫర్మీరా షాహీన్, సంయుక్త కార్యదర్శిగా కె.దిలీప్, కోశాధికారిగా ఎలమల ఖాసిం ఎన్నికయ్యారని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి నందగిరి శ్రీను తదితరులు పాల్గొనగా, నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కాగా, నూతన కలెక్టరేట్‌తో పాటు తాలూకా యూనిట్లలో టీఎన్జీవోస్ కార్యాలయాలకు స్థలాలు కేటాయించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్ రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు విన్నవించారు. దీంతో స్పందించిన మంత్రి స్థలం, భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించినట్లు తెలిపారు.



కమిటీ బాధ్యులను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు

డిగ్రీ కళాశాలను సందర్శించిన మంత్రులు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలను కళాశాల పూర్వ విద్యార్థి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా, అధ్యాపకులు వారికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు కళాశాలలోని వివిధ విభాగాలు, గ్రంథాలయాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే పేరున్న ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలను సందర్శించడం ఆనందంగా ఉందని తెలిపారు. మంత్రి పువ్వాడ మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాల రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగి ఉండడం గర్వంగా ఉందని చెప్పారు. అనంతరం కళాశాలలో చదువుతున్న ఎ.మైథిలి, లక్ష్మణ్‌లు ఇటీవల నిర్వహించిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లో ప్రతిభ చాటడంతో వారిని ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.వీ.రెడ్డితో పాటు అధ్యాపకులు డాక్టర్ సీతారాం, డాక్టర్ ఎన్.గోపి, కొండలరావు, డాక్టర్ జె.రమేష్, డాక్టర్ బి.వెంకన్న, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు



క్రీడాకారులను సన్మానిస్తున్న మంత్రులు

రాములమ్మకు మంత్రి నివాళి..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని నిజాంపేట్‌కు చెందిన బీఆర్ఎస్ నగర నాయకుడు మదూరి సైదారావు తల్లి రాములమ్మ ఇటీవల మృతి చెందగా.. బుధవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సైదారావు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ మదూరి ప్రసాద్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కన్నం ప్రసన్న కృష్ణ, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, శంషుద్దీన్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. బుధవారం ఖమ్మం రైల్వేస్టేషన్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5 నుంచి 15 వరకు స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ల పేరుతో ప్రతీ శక్తి కేంద్రంలోనూ సమావేశాలు నిర్వహించి, ప్రజలను చైతన్య పరచనున్నట్లు తెలిపారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీ లక్ష రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి జిల్లా ప్రజలు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ కడగంచి రమేష్, సహ ఇన్‌చార్జ్ విద్యాసాగర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేంద్ర, దేవకి వాసుదేవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యాంరాథోడ్, రుద్రప్రదీప్, నున్న రవికుమార్, అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్, నంబూరి రామలింగేశ్వరావు, మంద సరస్వతి, ఉషారాణి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం

నేలకొండపల్లి: అంధత్వ రహిత సమాజమే ప్రభుత్వం లక్ష్యమని నేలకొండపల్లి ఎంపీడీఓ కె.జమలారెడ్డి అన్నారు. మండలంలోని బోదులబండ, నేలకొండపల్లి కంటి వెలుగు కేంద్రాలను బుధవారం సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈమేరకు అక్కడ సౌకర్యాల గురించి అడిగి తెలుసుని కంటి పరీక్షకు సంబంధించిన పరికరాలను తనిఖీ చేశారు. కంటి వెలుగు కేంద్రాలకు ప్రజలను ఎక్కువగా తరలించి ప్రభుత్వ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్. గీత, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ మణిబాబు, పీహెచ్ఎన్ వాణి, దుర్గ పాల్గొన్నారు.



బోదులబండ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

‘రెజొనెన్స్ ఇన్ఫో’ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ నాగేంద్రకుమార్

ఖమ్మం సహకారనగర్: ఇటీవల నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో కిరణ్ ఫౌండేషన్ కల్చరల్ డ్యాన్స్ ఆర్గనైజేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి కూచిపుడి, భరతనాట్యం పోటీల్లో తమ విద్యార్థి బి.మహేశ్‌చంద్ర తృతీయ బహుమతి సాధించినట్లు రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమ, కె.శ్రీధర్‌రావులు తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

‘ఎస్‌బీఐటీ’లో శిక్షణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు బుధవారం ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ జి.కృష్ణ తెలిపారు. అనంతరం పరిశ్రమల శాఖ జిల్లా అధికారి కె.అజయ్‌కుమార్ పరిశ్రమను స్థాపించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, సుభాష్ చందర్, రవీంద్రబాబు, ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

తిరుమలాయపాలెం: యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని హస్నాబాద్‌కు చెందిన 22ఏళ్ల యువతి గత నెల 31న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో బుధవారం ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

‘రైతు బిడ్డలమని గర్వంగా చెప్పుకోవాలి’

ఖమ్మం సహకారనగర్: తల్లిదండ్రులు రైతు బిడ్డలు అయితే మనం కూడా రైతు బిడ్డలమని గర్వంగా చెప్పుకోవాలని ఉద్యానవన శాఖ ఖమ్మం డివిజన్ అధికారి గుడిమళ్ల సందీప్‌కుమార్ అన్నారు. బుధవారం ముస్తాఫానగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో సస్య భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యవసాయ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలను అందించారు. శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, పాఠశాల హెచ్ఎం శ్రీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సందీప్‌కుమార్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం అందించే లేబర్ కార్డులు అందక సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పడి చాలాఏళ్లు అవుతున్నప్పటికీ ఆ రోజున ఉన్న రేట్ల ప్రకారమే పథకాలను అమలవుతున్నాయన్నారు. 60 ఏళ్లు దాటిన వారికి రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు. లేనిరెఖడల రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను సమీకరించి లేబర్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గోసు పుల్లయ్య, పేరబోయిన వెంకన్న, గుగులోత్ పటేల్, లెనిన్, కె.శ్రీనివాస్, రామ్‌దాస్, శరత్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు, కార్మికులు